

నీరు 'భద్ర'మేనా?

- అప్పర్‌భద్రకు నిధుల కేటాయింపుతో ఆందోళన - నేడు రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాకు తుంగభద్ర నుంచి అందే నీటి వాటా భద్రంగా ఉంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అప్పర్‌భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో భారీ ఎత్తున నిధులు కేటాయించడమే. దీంతో జిల్లా రైతాంగంలో ఆందోళన మొదలైంది. దీనిపై సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు...

తుంగభద్ర ఎగువ భాగంలో కర్నాటక చేపట్టిన అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్లో రూ.5300 కోట్లు కేటాయించింది. తుంగభద్ర డ్యామ్‌పై తుంగ, భద్ర నదుల రెండూ కలసి తుంగభద్రగా హొస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్థక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి కర్నూలు జిల్లాకు నీటిని అందించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సి)కి 24 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో కేటాయిస్తున్న నీరు 18 టిఎంసిల నుంచి 20 టిఎంసిల వరకే ఉంటోంది. దీంతో తుంగభద్ర ఎ డ్యామ్కు ఎగువ భాగంలో కర్నాటక రాష్ట్రం తుంగ, భద్ర నదులపై



ప్రత్యేకంగా ప్రాజెక్టులు నిర్మిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని అభ్యంతరాలూ ఉన్నాయి. డ్యాముకు పైభాగంలో ప్రాజెక్టులు నిర్మిస్తే వర్షాలు అధికంగా వచ్చిన సమయంలో పెద్దగా సమస్య ఉండకపోవచ్చు. వర్షాభావ పరిస్థితులు నెలకొని వర్షాలు ఆలస్యమైన సమయంలో ప్రాజెక్టులోకి నీరు రావడం ఆలస్యమయితే దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి విడుదలలోనూ జాప్యం జరిగే అవకాశాలున్నాయి. తుంగభద్ర డ్యామ్‌లోకి నీరు రావడం ఆలస్యమయితే ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య సైతం ఉత్పన్నమయ్యే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తుండటం గమనార్హం. రాయలసీమలోని కరువు ప్రాంతాలకు ప్రధానమైన తుంగభద్ర డ్యామ్‌కు పైభాగంలో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5300 కోట్ల నిధులను కేటాయించింది. 29.75 టిఎంసిల సామర్థ్యంతో కర్నాటక రాష్ట్ర ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది పూర్తయితే సుమారు 30 టిఎంసిల నీరు ముందు భద్రలో నిలువ అయిన తరువాత తుంగభద్ర డ్యామ్‌లోకి వస్తాయి. కరువు జిల్లాలైన కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటిని అందించే తుంగభద్ర నుంచి నీటి విడుదల ఆలస్యం అయ్యేలా అప్పర్‌భద్రకు నిధులు కేటాయించడం పట్ల వామపక్షాలు, రైతు సంఘాలు, పలు పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు కెకె భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు.

రౌండ్ టేబుల్‌లో పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వం అప్పభద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం వల్ల రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీనిపై సోమవారం నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలి. ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తాం.

- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మహిళల భద్రతే లక్ష్యం

- అందుబాటులో దిశ యాప్, డయల్ 100

- ప్రజాశక్తితో దిశ డిఎస్‌పి బి.వెంకట్రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



మహిళల భద్రతే లక్ష్యంగా దిశ పోలీస్ స్టేషన్ పనిచేస్తుందని కర్నూలు దిశ డిఎస్‌పి బి.వెంకట్రామయ్య అన్నారు. మహిళలకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా వారికి అండగా నిలబడి పోలీసు రక్షణ ద్వారా తగిన న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని, ప్రభుత్వం అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దిశ సేవలను వినియోగిం చుకోవాలని ఆయన కోరారు. ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు...

దిశ పోలీస్ స్టేషన్ ఏర్పాటులో ముఖ్య ఉద్దేశం ఏమిటి?

డిఎస్‌పి : మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న నేరాలను నియంత్రించి మహిళలకు రక్షణ కల్పించాలన్నదే దిశ పోలీస్ స్టేషన్ల ఏర్పాటులో ఉన్న ప్రధాన ఉద్దేశం.

స్టేషన్‌లో ఎలాంటి నేరాలను పరిష్కరిస్తున్నారు?

డిఎస్‌పి : ప్రధానంగా మహిళల పట్ల సమాజంలో చులకన భావం సమాజంలో వారిని వేధిస్తోంది. ఈ నేపథ్యంలో మహిళల భార్యాభర్తల గొడవలు, వరకట్నం వేధింపులు, గృహహింస, అత్యాచార యత్నం, ఈవ్ టీజింగ్, ఫోక్సో వంటి నేరాలు స్టేషనుకు వస్తుంటాయి. ఫిర్యాదులను రిజిస్టర్ చేసి సమస్యలను ప్రొసీజర్ ప్రకారం దర్యాప్తు చేస్తాం.

మహిళ ఫిర్యాదును చేయడానికి ఎలాంటి అనుకూల పరిస్థితులు ఉన్నాయి?

డిఎస్‌పి : మహిళలకి ఏ అన్యాయం జరిగినా ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దిశ యాప్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని మహిళలు తమ ఫోన్లలో రిజిస్టర్ చేసుకొని గాని సమాచారం అందజేయవచ్చు లేదా నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా కేసును నమోదు చేసుకొని విచారణ చేపడతాం.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగం ఏమిటి?

డిఎస్‌పి : దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల మహిళలు ఏ పరిస్థితుల్లో ఎక్కడ ఇబ్బందులు పడుతున్నా లేదా అభద్రత, ప్రమాదంలో ఉన్నా దిశ యాప్ ద్వారా అందిస్తే ఐదు లేదా పది నిమిషాల్లోనే పోలీసులు యాప్ ద్వారా ట్రాక్ చేస్తూ ఘటన స్థలానికి చేరుకొని రక్షణ కల్పిస్తారు. ఇది అత్య ంత ఉత్తమమైనది. యాప్ డౌన్‌లోడ్ చేసుకోని వారు ఉంటే చేసుకోవడం మంచిది. పోలీసు టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 100కు ఫోన్ చేసిన కూడా పోలీసులు వెంటనే స్పందిస్తారు.

భార్యాభర్తల, కుటుంబ కలహాల విషయంలో ఎలా అనుసరిస్తారు?

డిఎస్‌పి : భార్యాభర్తల, కుటుంబ సాధారణ కలహాల నేపథ్యంలో మహిళలు ఫిర్యాదు చేసిన వెంటనే స్వీకరించి బాధ్యులకు సీఆర్‌పీసీ 41 నోటీసు అందించి విచారిస్తాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. చట్ట ప్రకారం విచారణ చేపట్టి కోర్టు ముందు ఉంచుతాం. బాధితులకు అన్ని విధాల న్యాయం జరిగేలా చూస్తాం.

దిశ యాప్ పట్ల అవగాహన కలిగించేందుకు ఎలాంటి కృషి చేస్తున్నారు?

డిఎస్‌పి : ఇదివరకే జిల్లాలో మహిళా భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ క్రింది స్థాయి వరకు పోలీసుల సహకారంతో మహిళల సెల్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాము. వాల్ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాము. పెద్ద ఎత్తున విద్యాలయాల్లో, గ్రామాలు, పట్టణాల్లో, పొదుపు సంఘాల మహిళలకు సమావేశాలు సభలు నిర్వహించి అవగాహన కల్పించాం.

స్టేషన్ పరిధిలో గతేడాది ఎన్ని కేసులు నమోదు చేశారు?

డిఎస్‌పి : దిశ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది మొత్తం ఐపిసి సెక్షన్ 498 ఏ కింద 1250 ఫిర్యాదులు అందాయి. కౌన్సిలింగ్‌లు నిర్వహించాం. వీటిలో 136 కేసులు నమోదయ్యాయి. ఇవే కాకుండా వీటితో పాటు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక కేసులను ఫోక్సో ఇతరాత్ర కేసులను సైతం దర్యాప్తు చేస్తున్నాం.



సమస్యలపై పోరు

- నేడు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకి అంగన్‌వాడీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారు. అయినా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యంలేదు. విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించటంలేదు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుండి బిల్లులు చెల్లించలేదు. దీని వలన అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండి పెడుతున్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు. కానీ వేతనాలు పెంచలేదు. అంగన్ వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదు. గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదు. ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదు. ఇప్పటికీ పౌష్టికాహారంలో ఇచ్చే మెనూ నిమిత్తం ఒక్కొక్క పిల్లవాడికి కేవలం 5 గ్రాముల నూనె, 15 గ్రాములు నాసిరకం కందిపప్పు ఇస్తున్నారు. కొన్ని ప్రాజెక్టులలో గత 2 నెలల నుండి ఆయిల్, పప్పు ఇవ్వలేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఉద్యోగ భద్రతలేదు. అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణలో చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ, సీడీపీఓ, సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. అనేక మంది పర్యటనల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారు. ఇలా అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు.

డిమాండ్లు ఇలా...

- అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి.
- వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి.
- సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, సూపర్ వైజర్ పోస్టులలో వయోపరిమితి తొలగించాలి.
- హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలి.
- 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలి. అదనంగా హెల్పరును ఇవ్వాలి.
- లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి, ఆయిల్, కందిపప్పు పరిమాణం పెంచాలి.
- ర్యాలీలు, సభలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ.1ని రద్దు చేయాలి.

సిపిఎస్ రద్దయ్యేదాక పోరాటం

కర్నూలులో యుటిఎఫ్



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సిపిఎస్ రద్దు అయ్యే వరకూ పోరాటం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సంకల్ప దీక్ష కార్యక్రమాన్ని కర్నూలు ధర్నాచౌక్ వద్ద జిల్లా అధ్యక్షులు జె.యల్లప్ప అధ్యక్షతన చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. సిపిఎస్ విధానం 2004 నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయని , సిపిఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు, ధర్నాలు, దీక్షలు, పాద యాత్రలు చేశామన్నారు. మన ముఖ్య మంత్రి ఎన్నికల సమయంలో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు రద్దు చేయకపోగా జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానాన్ని తెచ్చారన్నారు. దీన్ని యుటిఎఫ్ వ్యతిరేకించిందని, సిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని విజయవాడ దగ్గర గన్నవరంలో సంకల్ప దీక్షను ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు ఈ దీక్షను భగ్నం చేస్తూ ఉపాధ్యాయ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు దోరణులు చేపడుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ఈ హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకుంటా మన్నారు. ఈ దీక్షకు సంఘీభావంగా సిఐటియు నాయకులు అంజిబాబు, రామాంజనేయులు కెవిపి ఎస్ పక్షాన ఆనంద్ బాబు ,బిసిసంఘ నాయకులు శేషఫణి యాదవ్, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మారెప్ప జిల్లా కార్యదర్శులు నవీన్ , గాది లింగప్ప, నరసింహులు, రాష్ట్ర కౌన్సిలర్లు యెహోషువ, కాసిం,మల్లారి నాగరాజు, ఎన్.మద్దులేటి, ప్రసాద్, రాము, అన్ని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

పర్యవేక్షించిన ఆర్జేడి ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్షిప్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 16 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్షకు మొత్తం3601 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3374 మంది విద్యార్థులు హాజరయ్యారు. 227 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు నగరంలోని టౌన్ మోడల్ పరీక్ష కేంద్రంలో కడప ఆర్‌జెడి ప్రతాపరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామెల్ పాల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణరావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామన్నారు.



'మానవతా మూర్తులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ గ్రంథాలయంలో కమలాకలానికేతన్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి రామలింగమ్మ, డాక్టర్ జి.నల్లారెడ్డి రచించిన మానవతామూర్తులు పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఉపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పుస్తక సమీక్షకులుగా విశ్రాంతి తహశీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ ఈ పుస్తకం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరి చేతులలో ఉండదగినదన్నారు. మానవతామూర్తులు పుస్తకంలోని వ్యక్తులంతా మానవత్వం కలిగిన వారిని, సమాజానికి సేవలు అందించారన్నారు. అందులో ముఖ్యంగా ఆర్థిక సేవలు విద్యా ,ధాన్య, క్షేత్ర , దేవాలయాలకు, రక్తదాన సేవలు ఇలా ఒకటేమిటి ఎన్నో రకాల సేవలు చేసిన గొప్ప వ్యక్తులను గూర్చి తెలుసుకొని వారి వివరాలను సేకరించి ఒక పుస్తకంలో చేర్చడం ఎంతో గర్వకారణమన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తులను గూర్చి రచించిన రామలింగమ్మ నల్లారెడ్డి ప్రశంసనీయులన్నారు. ఆదోని శ్రీలలిత కళా సేవా సంస్థ వారు రామలింగమ్మ సాహితీ సేవలకు మెచ్చి అభినవ మొల్లకవి కోకిల బిరుదులను ప్రదానం చేశారు. ఎన్నో కష్టాలకోర్చి దాదాపు 40 యేళ్లుగా 60కి పైగా పుస్తకాలు రచించి సమాజంలో నైతిక విలువలు పెంపొందించుటకు పాటు పడిన కవి సవప్ప గారి ఈరన్నను కూడా ఆదోని లలితకళా సేవాసంస్థ వారు సంఘసంస్కర్త బిరుదుతో సత్కరించారు. ఉమాపతి కాసింశెట్టి, హను మాన్ సింగ్ అధ్యాపకులు యాదవ్ మొదలైన వారు పాల్గొని సభను జయప్రదం చేశారు.



సవ్వప్పగారి ఈరన్నను సత్కరిస్తున్న నిర్వాహకులు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించండి

కాంగ్రెస్ అధికారంలో కి వస్తే 3 లక్షల రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్

రాష్ట్రంలో ఇసుక, మద్యం, భూ మాఫియా పెరిగిపోయింది

ప్రజాశక్తి-పత్తికొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. హాథ్ సే హాథ్‌జోడో అభియాన్ కరపత్రం, రాహుల్ గాంధీ లేఖను ఆదివారం పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, కర్నూలు డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి క్రాంతి నాయుడు ఆవిష్కరించారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా పత్తికొండ ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ లో డిసిసి ప్రధానకార్యదర్శి, పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి క్రాంతి నాయుడు అధ్యక్షన సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు హాథ్ సే హాథ్ జోడో యాత్ర పరిశీలకులు శ్రీరాములు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ పాల్గొని హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. దేశంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోతే అభివృద్ధి ఫలాలు రేపటితరం పొందలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని రాహుల్ గాంధీ వెల్లడించారన్నారు. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చే డబ్బులకు అమ్ముడు పోవద్దని ప్రజలకు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భూ మాఫియా, మద్యం మాఫియా, ఇసుక మాఫియా రోజు రోజుకు పెరిగి పోతున్నదని వారు విమర్శించారు. హస్తం గుర్తుకు ఓటు వేయకపోవడం వల్లే రాష్ట్రం, దేశం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ప్రస్తావన చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగుప్త, కర్నూల్ సిటీ మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా హుస్సేన్ , మహిళా నాయకులు సుజాత , పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ నాయకులు మహబూబ్ బాషా, రవి, ఉస్సేన్, నాగార్జున, ఉపేంద్ర పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హాత్‌సే హాత్ జోడో కరపత్రాలను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాహితీ ప్రపంచంలో 'ఎండ్లూరి' ధృవతార

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఆధునిక కవిత్వం మల్లెమొగ్గల గొడుగులా కవిత్వపు నీడనిస్తున్న కాలం నుండి రాస్తున్న కవుల్లో తొలిగా దళిత అస్తిత్వ ఉద్యమ కవిత్వాన్ని అక్షరీకరించిన ధిక్కారకవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అని ప్రముఖ విమర్శకులు భార్గవ అన్నారు. నగరంలోని టిజివి కళాక్షేత్రంలో ఆదివారం డప్పోల్ల రమేష్ సంపాదకత్వంలో వెలువరించిన ఎండ్లూరి కవనకళ, స్మారక స్వరం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కర్నూలు కవులు నిర్వహించిన ఈ సభకు కథారచయిత మారుతీ పౌరోహితం అధ్యక్షత వహిస్తూ సాహితీ ప్రపంచంలో ఎండ్లూరి సుధాకర్ ధృవతార అన్నారు. ఆవిష్కర్త మాట్లాడుతూ తన జీవితమంతా ఉద్యమమయ్యే సాగిందని, కవిత్వాన్ని ఉద్యమానికి ఆయుధంగా వాడినవాడన్నారు. బహుశా ఈకాలపు మహోజ్వలిత దళిత ఉద్యమకారుడని కొనియాడారు. ప్రముఖకవి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎండ్లూరి కవిత్వం నిండా ఆర్తి, ఆర్ధ్రతలే ఉంటాయని, కవిత్వపు ఉద్యమాక్షరాలు విస్ఫోటనాలకే తెలుగు దళిత కవిత్వానికి వెలుతురు దారులు పరిచాయన్నారు. ఆయన కవిత్వాన్ని సృశించడడం, కవిత్వం గూర్చి మాట్లాడటమంటే దళితుల పక్షాన నిలబడి సమరం చేయడమే నన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ అరుణ మాట్లాడుతూ సమాజంలోని మనిషి జీవితాల్ని శాసిస్తున్న వర్ణవ్యవస్థపై సుధాకర్ కవిత్వం తిరగుబాటు జెండా ఎగరేసిందన్నారు. విస్తరిస్తున్న మతోన్మాదంలో అణగారిన ప్రజల ఆర్త నాదాలు కవిత్వ వస్తువు లయ్యాయన్నారు. నిత్యం తన జాతి ఎదుర్కొంటున్న సమస్యలొక్కటే కవిత్వమవ్వలేదని అతడి కవిత్వం సామాజిక అసమానతలపై ఎర్రని నిప్పుకణిక లయ్యిందన్నారు. విరసం నాయకులు పాణి మాట్లాడుతూ ఎండ్లూరి సుధాకర్ దళిత తాత్విక చింత నాపరుడని ఆయన ఆలోచన కవిత్వపు అలజడి దళిత దృక్కోణమేనన్నారు. మనువు ఆడిన దొంగనాటకాన్ని మనుధర్మం చెప్పిన నీతిమాలిన సూత్రాల్ని తన కవిత్వపుమంటల్లో కాల్చేసిన వాడు ఎండ్లూరి సుధాకర్ అన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ ఎండ్లూరి సుధాకర్ బహుముఖీయ ప్రజ్ఞకలిగినవాడని అన్నారు. అనేకభాషలపై పట్టున్న లబ్ధప్రతిష్ఠుడని ఇప్పటికీ తన అనువాదం చేసిన ఒక హిందీగీతం చదివాక అతడెంత గొప్ప సాహిత్య సృజనాకారుడో అర్థమౌతుందన్నారు. ఆయన సాహిత్యాన్ని మరింత చేరువ చేయడం మన బాధ్యతన్నారు. సభలో కవులు జంధ్యాల రఘుబాబు, అయ్యన్న, ఎస్‌డివి అజీజ్, ఎవి రెడ్డి, సయ్యద్ జహీర్ అహ్మద్, పెరికల రంగస్వామి తదితరులు మాట్లాడారు.



ఎండ్లూరి కవనకళ, స్మారక స్వరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎల్ఐసి ఆఫీసుల వద్ద నిరసన విరమించండి

కాంగ్రెస్ పార్టీకి ఎల్ఐసి యూనియన్ వినతి

పాలసీదారుల సొమ్ము క్షేమం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్: ఎల్ఐసి పాలసీదారుల సొమ్ము క్షేమమని, ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎల్ఐసి కార్యాలయాల ఎదుట నిరసన తెలిపే ఆలోచన విరమించుకోవాలని క్లాస్ వన్ ఆఫీసర్స్ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎల్లారెడ్డి, జె.చంద్రపాల్, ఎన్ఎఫ్ ఐఎఫ్ డబ్ల్యు కడప డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.రాజశేఖర్, ఆర్.సునియకుమార్, ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండన్ బర్గ్ అదాని గ్రూప్ సంస్థలపై తీవ్ర విమర్శలతో ఒక నివేదికను ప్రచురించినప్పటి నుండి, అదాని సంస్థల్లో ఎల్ఐసికి భారీగా పెట్టుబడులు వున్నాయని, మధ్యతరగతి పొదుపు మొత్తాలకు దానివల్ల ముప్పు ఉందన్న కోణంలో చాలామంది వ్యక్తుల నుంచి, రాజకీయ పార్టీల నుంచి ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఎల్ఐసి సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిలో అత్యధికులకు ప్రాతినిధ్యం వహిస్తూ, పాలసీదారుల ప్రయోజనాలే పరమ లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేసే ఉద్యోగ సంఘాలుగా ఈ అంశంపై మా వైఖరిని వ్యక్తం చేస్తున్నామని, ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగే రీతిలో దేశంలోని ఏ పారిశ్రామిక గ్రూపునకు రాజకీయ దన్ను అందినా తాము దాన్ని వ్యతిరేకిస్తామని, హిండన్ బర్గ్ నివేదిక లోని నిజానిజాలని బయట పెట్టడానికి, ప్రభుత్వం ఒక నిష్పాక్షిక విచారణను ఆదేశించాలని కోరుతున్నామన్నారు. ఎల్ఐసి పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటైన సంస్థ, అందువల్ల అది తన పెట్టుబడులపై తీసుకునే అన్ని నిర్ణయాలు పార్లమెంటు పరిశీలనకు, నియంత్రణ సంస్థల పర్యవేక్షణకు లోబడే ఉంటాయన్నారు. ఎల్ఐసి 80శాతం పెట్టుబడులని ప్రభుత్వ సెక్యూరిటీలలోనూ, బాండ్లలోనూ పెట్టుబడులు పెడుతుందన్నారు. మిగిలిన 20 శాతం పెట్టుబడులను మాత్రమే షేర్లలో పెడుతుందన్నారు. అందువల్ల, ఎల్ఐసి పాలసీదారుల పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని చెప్పదలుచుకున్నామన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి పిడిఎఫ్ తరపున బరిలో నిలిచిన డాక్టర్ పోతుల నాగరాజు ఆదివారం కర్నూలులో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. నగరంలోని స్థానిక శ్రీకష్ణదేవరాయల సర్కిల్లో ధర్నా చౌక్ లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ నిర్వహించిన సంకల్ప దీక్షకు సంఘీభావం తెలిపారు. సిపిఎస్ రద్దుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ క్యాంపు పరిధిలో కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని తనకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జిల్లా పరిషత్ లోని నిర్వహించిన ఉపాధ్యాయుల అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. నగర శివారులోని స్థానిక జిఆర్‌సి ఫంక్షన్ హాలులో ఎపి అమరావతి జేఏసీ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న ఉద్యోగులను కలిసి ఆయన తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు పట్ల వారికి వివరించారు. రాబోయే మండలి ఎన్నికల్లో తనను మండలికి పంపిస్తే తప్పనిసరిగా ఉద్యోగుల, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బిసి సంఘం సీనియర్ నాయకులు టి. శేషపనితోపాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

కార్మిక, కర్షకులకు కేంద్ర బడ్జెట్ వ్యతిరేకం : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఈనెల 1వ తేదీన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వర్గానికి రైతాంగానికి కూలీలకు వ్యతిరేకమైన బడ్జెట్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. వెంకటేశులు విమర్శించారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో మండల కమిటీ సమావేశంలో నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఎరువుల సబ్సిడీ 50 వేల కోట్లు కోత పెట్టిందని, అలాగే ఆహార సబ్సిడీ లక్ష కోట్లకు కుదించిందని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీకి 30 వేల కోట్లు కోత పెట్టిందని ఆయన విమర్శించారు. మరోపక్క విభజన ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో పేర్కొన్న విధంగా నిధులు, ప్రత్యేక హోదా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, రాజధాని అభివృద్ధికి, మెట్రో రైల్వేకి నిధులు కేటాయింపు చేయలేదని ఆయన విమర్శించారు. సిపిఎం పార్టీ ఈ బడ్జెట్ ని పూర్తిగా వ్యతిరేకిస్తుందని, ప్రవేశపెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టబోయే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కే లింగన్న,మండల కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు,ఉచ్చీరప్ప,మండల కమిటీ సభ్యులు బాష,అయ్యప్ప తిక్కప్ప,చిన్న తిక్కన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పార్థసారథి

వాల్మీకుల హక్కుల సాధనకు పోరాడుదాం

- డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

వాల్మీకుల హక్కుల సాధనకు రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాడాల్సిన అవశ్యకత ఏర్పడిందని డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలోని సాయి భారతి స్కూలులో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులకు అన్ని రంగాల్లో ఎస్టీ రిజర్వేషన్ సదుపాయం లేకపోవడంతో రాజ్యాంగబద్ధంగా హక్కులను కోల్పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ భవిష్యత్తు ప్రణాళిక రచించేందుకు త్వరలో ఎమ్మిగనూరులో నిర్వహించే వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కార్యాచరణ 14న ప్రకటిస్తామని తెలిపారు. అందరూ సమిష్టంగా ఉద్యమాల వైపు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ధనాపురం తిక్కన్న, మంత్రాలయం నియోజకవర్గం వాల్మీకి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, మాజీ సర్పంచ్ కోసిగి ముత్తిరెడ్డి, మాధవరం రాఘవేంద్ర రెడ్డి, రామి రెడ్డి, నిల కంటప్ప, దస్తగిరి నాయుడు,వాల్మీకి సంఘం నాయకులు కపటి ఉషా రాజు, వాల్మీకి సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, కల్లుబావి రాజు, అడ్వకేట్‌లు వీరేష్, వీరన్న నాయుడు, నాయకులు రామాంజనేయులు, ఆరేకల్ రామ కృష్ణ, జాలమంచి మాజీ సర్పంచ్ గోవింద్, పాడేగల్ అయ్యన్న, చిరుతపల్లి ఈరన్న, అరేకల్ నాగిరెడ్డి,వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి రాజగోపురం నిర్మాణానికి విరాళం ఇచ్చినట్లు దేవాలయ ముఖ్య అర్చకులు పూజన్న స్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణం చెందిన కోడి గంటి చిన్నయ్య కుటుంబ సభ్యులు రూ.100116లు రాజగోపురం నిర్మాణానికి ఇవ్వడం జరిగిందన్నారు. వీరికి స్వామివారి దర్శనంతో పాటు శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పుణ్యక్షేత్రంలో రాజగోపురం నిర్మాణంతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమాలు చేపట్టామ న్నారు. భక్తులు విరాళాలు అందించి అభివృద్ధి పనులు పాలుపంచుకోవాలని కోరారు.

కౌలుట్ల స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - దేవనకొండ


పూజలు నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామికి ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, పలు గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం


భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న పీఠాధిపతి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి శ్రీమఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం పౌర్ణమి సందర్భంగా రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు చేసి గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ పల్లకీలో ఉంచి వేద మంత్రాలతో మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. సేవా దారులతో పాటు సాధారణ భక్తులకు కూడా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

పోలీసులు, జర్నలిస్టుల మధ్య స్నేహ భావంతో క్రీడలు : సిఐ

ప్రజాశక్తి - ఆలూరు


క్రీడలను ప్రారంభిస్తున్న ఆలూరు సిఐ ఈశ్వరయ్య

పోలీసుల, జర్నలిస్టుల మధ్య క్రీడలు స్నేహ భావంతో క్రికెట్ పోటీలు జరగడం అభినందనీయం అని ఆలూరు సిఐ ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సీనియర్ జర్నలిస్ట్ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్, జర్నలిస్టుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. సిఐ టాస్ ఎగురవేసి, మొదటి బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారం భించారు. కెప్టెన్లుగా ఎస్ఐ విజయ్, జర్నలిస్ట్ సాహెబ్ జాన్ వ్యవహరించారు. పోలీస్ జట్టు విన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విన్నర్స్‌గా నిలచిన పోలీస్ జట్టుకు, రన్నర్స్‌గా జర్నలిస్టుల జట్లకు ఏపియుడబ్ల్యుజె జిల్లా నాయకులు సుంకన్న, స్వరూప్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో ఎస్ఐలు డాక్టర్ నాయక్, రామనుజులు,విజయ్,మల్లికార్జున, జర్నలిస్ట్ లు కోటి, యశోద కుమార్,రాజు,గోపాల్,సూరి,అంజి,సోము,నాగరాజ్ గౌడ్, యూసుఫ్,నాగ్, డేనియల్, వీరేశ్,రాజేష్ కర్ణ,గోవింద్ రాజులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా తేవడంలో..

అధికార, ప్రతిపక్షాలు విఫలం

- మోడీకి తొత్తులు సీఎం జగన్,చంద్రబాబు
- మతం, కులం మధ్య చిచ్చు పెట్టడమే బిజెపి ఎజెండా
- కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి

ప్రజాశక్తి - ఆదోని


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి

ఏపీకి ప్రత్యేక హోదా, వెనకబడిన ప్రాంతాలకు ఆర్థిక ప్యాకేజీ సాధించడంలో సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబులు విఫలం చెందారని కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి అన్నారు. ఆదివారం ఆదోనిలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి దేవిశెట్టి ప్రకాష్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ బాబు, తదితరులు హాజర య్యారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి, సుధాకర్ బాబు మాట్లాడుతూ మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతూ సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తొత్తులుగా మారారన్నారు. పార్లమెంట్లో ఏపీ ప్రయోజనాల కోసం ఎంపీలు గొంతెత్తిన పాపాన పోలేదని మండిపడ్డారు. స్వార్ధ రాజకీయాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలను ఆ ఇరు పార్టీలు గాలి వదిలేశారని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఆ ఊసే మరిచారన్నారు. మతం, కులం మధ్య చిచ్చు పెట్టి దేశ జాతి సమైక్యతను దెబ్బతీసే కుట్ర పన్నుతున్నారన్నారు. దీన్ని తిప్పికొట్టేందుకే కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. జాతి సమైక్యత కోసం చేపట్టిన ఈ జోడయాత్రకు మోడీ ప్రభుత్వం అడుగడుగున ఆటంకం కనిపిస్తూ ఇబ్బందులు గురిచేసిందన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 4080 కిలోమీటర్లు 135 రోజులు పాద యాత్ర కొనసాగిం చిన ఘనత రాహుల్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తామని ఆదోని కొచ్చిన సందర్భంగా రాహుల హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సుమారు 8 లక్షల కోట్లు ను ఆదని గ్రూపుల ద్వారా దేశ సంపద హావిరైన పీఎం మోడీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆర్థిక నేరగాళ్లకు వత్తాసు పలుకుతూ సుమారు రూ.5000 కోట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేసి వారి ప్రయోజనాలకు మోడీ సహకరి ంచారని మండిపడ్డారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగ మధు, శ్రీరాములు, సత్యనారాయణ గుప్తా, బజారి, తాయన్న, నూర్, హనుమంత ఉన్నారు.

హోళగుంద : హోళగుందా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డిఎస్ బాషా ఆధ్వర్యంలో ఆత్సే హాత్ జూడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండు నుండి నాయకులు, కార్యకర్తలు భారీ ఊరేగింపు చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, కోఆర్డినేటర్ శ్రీరాములు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి యువతకు ఉద్యోగాలు కరువైయాయన్నారు. భారత్ జోడయాత్ర ఆలూరులో ప్రారంభించామని పాదయాత్ర విజయవంతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు బజార్ అన్న, ఐఎన్‌టిసి అధ్యక్షుడు బతకన్న, రాయలసీమ కోఆర్డినేటర్ శ్రీరాములు, మధు యాదవ్, ఖాజా హుస్సేన్, జోష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎస్ నూర్, మంగయ్య, మల్లయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


హాత్సే హాత్ జూడో అభియాన్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుంకునూరులో డివైఎఫ్ఐ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకునూరు గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) గ్రామ కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆదివారం కుంక నూరు గ్రామంలో జరిగిన డివైఎఫ్ఐ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీర శేఖర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రవేట్ జపం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న టువంటి జాబ్ కాలెండర్లు జాబ్ లేస్ కేలండర్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాల కోసం యువతలో ఉన్నటువంటి ప్రతిభ ఆధారంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారి జీవనోపాధికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సంఘం దేశవ్యాప్తంగా నిరుద్యోగం, విద్యా, ఉపాధి అవకాశాలపై విస్తృతమైన ఆందోళన నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోఎన్నికలలో ఆయా పార్టీలు హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగాలు కల్పన లో విఫలమైన నేపథ్యంలో యువతను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనను డివైఎఫ్ఐ చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి సంజన రైతు సంఘం నాయకులు దస్తగిరి, గ్రామ యువకులు, విద్యార్థులు శ్రీనివాసులు, వీరేంద్ర, గురురాజా సూరి మహేష్, రంగస్వామి, కేశవ, రాము, రాముడు, తదితరులు పాల్గొన్నారు. డివైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షులుగా చిన్న వీరేంద్ర, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా గణేష్, హరికృష్ణ, గురు రాజా, హరికృష్ణ, చెన్నకేశవ, సింహాద్రిలు ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైయిన డివైఎఫ్ఐ కమిటీ

మూతపడ్డ సీజనల్ హాస్టల్స్

ప్రజాశక్తి - హాలహర్వి

వలసలు కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకము కలగరాదనే ఉద్దేశముతో ప్రభుత్వము ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్స్ మూతపడ్డాయి. గ్రామాలలో ఉపాధి కరువై పేదలు సుదూర ప్రాంతాలకు వలస బాట పట్టారు. పిల్లలను ఆదుకోవాలని ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్స్ నిర్వహకుల నిర్లక్ష్యం వల్ల ఆదుకోవడం లేదు. మండల పరిధిలో నిట్రవటి గ్రామములోని హాస్టల్-2, బిలే హాల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని హాస్టల్-2 ఆదివారం మూతపడ్డాయి. దీంతో విద్యార్థులు ఇంటి వద్ద ఉన్న అరకొర భోజనంతో కడుపు నింపుకోవాల్సి వస్తోంది. ప్రతి రోజు విద్యార్థులకు మెనూ సక్రమంగా అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు స్పందించి సీజనల్ హాస్టల్స్‌పై విచారణ జరిపించి బాద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


మూసిన సీజనల్ హాస్టల్

అప్పర్ భద్రతో రాయలసీమకు అన్యాయం

- ఎల్‌ఎల్‌సీ నీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యుడు సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని



కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయల సీమకు నీళ్ల రాక ఎడారిగా మారి తీవ్ర అన్యాయం జరిగే అవకాశ ముందని తుంగభద్ర నీటి వాటా పరిరక్షణ సమితి సభ్యులు సాయిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు తక్షణసాయంగా రూ.5,300 కోట్లు కేటాయించడం చూస్తుంటే బిజెపి తాపత్రయం అర్థమవుతు ందన్నారు. 71 శాతం నిర్మాణం పూర్తయిన పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్లో ఒక్క పైసా కూడా కేటాయించక పోవడం బట్టి చూస్తుంటే ఆంధ్రపై ఉన్న వివక్షత తేట తెల్లమవుతుం దన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు కింద హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి ద్వారా లక్షలాది ఎకరాలు పంట సాగు జరుగుతుందన్నారు. అక్కడ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే తుంగభద్ర డ్యామ్‌కు నీటి చేరిక తగ్గుతుందన్నారు. దీంతో రాయలసీమ నీటి వనరులకు తీవ్ర ప్రమాదంగా మారిందన్నారు. ఆదోని డివిజన్‌లోని మంత్రాలయం నియోజకవర్గంలో మరింత కరువు జటలమయ్యే ప్రమాదం ఉందన్నారు. నిత్యం కరువులకు గురవుతున్న ఆ ప్రాంతంలో సాగునీరు చుక్క కరవయ్య ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో వేలాదిమంది కూలీలు ఉపాధి కొరకు గుంటూరు విజయవాడ హైదరాబాద్ ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. వలస నివారి ంచడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు. రాయలసీమ జిల్లాల ప్రజలకు కొంత మేరకైనా సాగు, తాగు నీరు అందించే తుంగభద్ర ప్రాజెక్టుపై నిర్మించే అప్పర్ భద్ర వల్ల రాయలసీమ ఎడారిగా మారనుందన్నారు. రాయలసీమను బలిపెట్టడానికి సిద్ధమై అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తోందని విమర్శించారు. రాయలసీమ డిక్లరేషన్ అంటూ హడావుడి చేసిన ఆంధ్ర బిజెపి నాయకులు మౌన ముద్రలో ఉన్నారన్నారు. మన రాష్ట్ర నీటి వాటాను, ప్రభుత్వ అభ్యంతరాలను ఏ మాత్రం బేఖాతరు చేయకుండా అప్పర్ భద్రకు అనుమతులు, నిధులు ఇస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్యలపై పోరాడాల్సిన నాయకులు తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు. ఎల్ఎల్‌సి హగరిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు, మెలగనూరు వద్ద ఆనకట్ట నిర్మాణం చేపట్టాలని కోరుతున్న ప్రభుత్వాలు పెడచెవిన పెడుతూ ఇక్కడ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు సమైక్యంగా సాగునీటి కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

వైభవంగా రథోత్సవం

పజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన కౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారం భించారు. పత్తికొండ సీఐ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్సై భూపాలుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించడానికి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి కిట్టు, ఎంపీపీ భర్త లుమాంబ మండల వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, వైసీపీ మండల నాయకులు మద్దిలేటి నాయుడు, దివాకర్ నాయుడు, ప్రేమ్ నాథ్ రెడ్డి, నారాయణ రెడ్డి,మదనమోహన్ రెడ్డి, ఎల్కే శ్రీను, వీరేశు, తిరుమలేష్ నాయుడు పాల్గొన్నారు.

కోసిగి రూరల్ : కోసిగిలోని సిద్ధారూడు స్వామి సప్తమ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చివరి రోజు రథోత్సవం సాయంత్ర సంధ్యావేళా అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం,బిల్వార్చన, పంచామృతంతో ప్రత్యేక పూజలు చేశారు. హుబ్బలి మఠం అభినవ సిద్ధారూడు మహా స్వామి ఆధ్యాత్మిక ప్రసంగాలు ద్వారా వచ్చిన భక్తులకు ఉపన్యాసం చేశారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా స్వామివారి పల్లకిని ఊరేగించి చెక్క కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సప్తమ వార్షికోత్సవ ఉత్సవాలకు రాయచూరు, సింధనూర్, బళ్ళారి,హుబ్లీ, ధార్వాడ ప్రాంతాల నుంచి సిద్ధారుడా స్వామి మఠం పీఠాధిపతులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. అంతకుముందు సిద్ధారూఢ మహాస్వాముల వారి పల్లకోత్సవాన్ని కోసిగి పట్టణ పురవీధులగుండా ఊరేగించారు. పల్లకోత్సవం ఊరేగింపులో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం చేయడం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సద్గురు ఆరుడజ్యోతి శాంతా శ్రమంలో సిద్ధార్థుడు స్వామి జాతరకు వచ్చిన వేలాది మంది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి సంవత్సరం ఉచితంగా భోజన వసతిని ఏర్పాటు చేస్తుండడం పట్ల భక్తులు కమిటీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరరాజు దొర, జెరుబండి నరసింహులు, వెంకట రెడ్డి, ముకుంద కిష్టప్ప, లక్ష్మి నారాయణ, కిందిగేరి తిమ్మప్ప, ఈరేడ్డి, తిరుమల, నరసరెడ్డి తదితర భక్తులు పాల్గొన్నారు. **హాలహర్వి :** మండల పరిధిలోని బాపురం గ్రామంలో శ్రీ ఉద్భవమూర్తి బసవేశ్వర స్వామి రథోత్సవం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఉదయం నుండి భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులను తీర్చు కున్నారు. వచ్చారాపల్లి నుంచి కలశంతో ఊరేగింపుగా తీసుకొచ్చి.. సాయంత్రం రథోత్సవం లాగారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు వచ్చి ఈ రథోత్సవాన్ని తిలకించారు. వీరయ్య స్వామి, శంబు లింగయ్య స్వామీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు. బాపురం ఎంపీటీసీ భర్త పాల్ రెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, ముఖ్య నేతలు పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై విజయ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.


హాలహర్వి : బసవేశ్వర స్వామి రథోత్సవం లాగుతున్న భక్తులు


రథోత్సవంలో నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి,


కోసిగిలో..


ఇళ్లు ప్రారంభిస్తున్న వైసిపి నేత ప్రదీప్ రెడ్డి

జగనన్న ఇల్లును ప్రారంభించిన వైసిపి నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ ద్వారా నిర్మితమైన సొంతింటిని వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీకి సమీపంలో సూగూరు రహదారిలోని జగనన్న కాలనీలో నిర్మించిన కటికె నసీమ రాజా సాబ్ దంపతులకు చెందిన ఇంటిని రిబ్బన్ కట్ గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీల నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పేదవాడి సోంతింటి కల నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం లో భాగంగా ఇంటి స్థలం తో పాటు, ఇళ్ల మంజూరు చేసిందని లబ్దిదారుల ఆహ్వానం మేరకు గృహ ప్రవేశం చేశామని తెలిపారు. ఏపీలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అదే కాలన్నీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పునా దులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, మండల నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, మద్దిలేటి, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో

బెంగుళూరులో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కౌతాళం


రాఘవేంద్ర (ఫైల్)

మండల పరిధిలోని లింగాలదీన్ని గ్రామానికి చెందిన వలస కూలీ బెంగుళూరులో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లింగాలదీన్ని గ్రామానికి చెందిన చెన్నప్ప శారదమ్మ దంపతులకు మూడవ సంతానమైన రాఘవేంద్ర కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరుకు వలస వెళ్లారు. గత కొనిరోజుల క్రితం రోజు మాదిరిగా బెల్దారి పనివెళ్లిన రాఘవేంద్ర పని పనిచేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురైయ్యాడు. చుట్టుపక్కల వారు వెంటనే బెంగుళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. రాఘవేంద్రకు ఎనిమిది నెలల క్రితమే ఆదిలక్ష్మితో వివాహం జరిగింది. మృతుడి కుటుంబం, గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని శవం లభ్యం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల పరిధిలోని బంటన హాల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు చిప్పగిరి పోలీసులు తెలిపారు. 35 నుండి 40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి ఉన్న మృతదేహం ఉందని తెలి పారు. ట్రైన్ పైకి ఎక్కడం వలన కరెంటు షాక్ తలకు తగిలి ఛాతికి చేతులకు కాలిన గాయములు ఉన్న సందర్భంగా చనిపోయి ఉంటాడని ఊహిస్తున్నామన్నారు. సమాచారం తెలిసిన వారు 9866144616, 9000324227 నంబర్లకు తెలియజేయాలన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ శివరాములు తెలిపారు. పట్టణంలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగాయి. పరీక్ష కేంద్రానికి ఆయా పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. అందులో 2314 మందిగాను 153 మంది విద్యార్థులు గైరాజరైనట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనపరిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి ఏటా రూ. 12 వేలు కేంద్ర ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తుందన్నారు.




హిందూ మాల అన్నసత్రంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

సమస్యలపై పోరు

- నేడు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకి అంగన్‌వాడీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారు. అయినా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యంలేదు. విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించటంలేదు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుండి బిల్లులు చెల్లించలేదు. దీని వలన అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండిపెడుతున్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు. కానీ వేతనాలు పెంచలేదు. అంగన్ వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదు. గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదు. ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదు. ఇప్పటికీ పౌష్టికాహారంలో ఇచ్చే మెనూ నిమిత్తం ఒక్కొక్క పిల్లవాడికి కేవలం 5 గ్రాముల నూనె, 15 గ్రాములు నాసిరకం కందిపప్పు ఇస్తున్నారు. కొన్ని ప్రాజెక్టులలో గత 2 నెలల నుండి ఆయిల్, పప్పు ఇవ్వలేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఉద్యోగ భద్రతలేదు. అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణలో చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ, సీడీపీఓ, సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. అనేక మంది పర్యటనల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారు. ఇలా అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు.

డిమాండ్లు ఇలా...

- అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి.
- వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి.
- సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, సూపర్ వైజర్ పోస్టులలో వయోపరిమితి తొలగించాలి.
- హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలి.
- 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలి. అదనంగా హెల్పరును ఇవ్వాలి.
- లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి, ఆయిల్, కందిపప్పు పరిమాణం పెంచాలి.
- ర్యాలీలు, సభలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ1ని రద్దు చేయాలి.

కోటంరెడ్డి మాటలన్నీ టిడిపివే..

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి - శ్రీశైలం

కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వైసిపికి ఇక ఎటువంటి సంబంధం లేదని, ఆయన మాటలన్ని టిడిపి మాటలేనని, ఫోన్ టాపింగ్ వ్యవహారం కాలమే నిర్ణయిస్తుందని వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీశైలం క్షేతంరలోని మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టిడిపితో ముందే టచ్‌లో ఉండి ఇప్పుడు టిడిపి అని ఆయనే ప్రచారం చేసుకుంటున్నాడని, లోకేష్ పాదయాత్ర ప్రజల్లో ఎలాంటి చర్చా లేదన్నారు. పాదయాత్ర టిడిపి రాజకీయ ఊరేగింపులా హంగూ ఆర్భాటలు తప్ప ఏమి లేదన్నారు. చంద్రబాబు వయసు పైబడి వారసత్వం కోసం పాదయాత్ర తప్ప జనాల్లో ఉన్నానని చేసే యాత్ర కాదన్నారు. అనంతరం ఆది జాంబవ అరుంధతి హిందూ మాదిగ సత్రం కోసం స్థల పరిశీలన దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, స్థానిక మాదిగ సత్రం నాయకులు కలిసి పరిశీలించారు. అనంతరం శ్రీశైలం క్షేత్రంలో టోల్గేట్ సమీపంలో ఉన్న హిందూ మాల అన్న సత్రంను మొదటి నుండి సత్ర నిర్మాణం దాతలు గురించి, రూములను పరిశీలించారు. సత్రం నిర్వహణపై సత్రం ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులును అడిగి తెలుసుకున్నారు. సంతృప్తిని వ్యక్తం చేస్తూ దళితులు ఐకమత్యంగా ఉండాలని, అప్పుడే బలం పెరుగుతుందని అన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

- యుటిఎఫ్ నేతలు డిమాండ్
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట సంకల్ప దీక్ష

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తానని అప్పటి ప్రతి పక్ష నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావస్తుందని, ఇప్పటికైనా రద్దు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి.ప్రసాద్, జె.సుధాకర్‌లు డిమాండ్ చేశారు. ఈ నెల 3న తలపెట్టిన సంకల్ప దీక్షలను భగ్నం చేసినందుకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయలు, యుటిఎఫ్ నాయకులు సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3న విజయవాడ దగ్గర ధర్మ స్థలి వద్ద రాష్ట్ర స్థాయి సంకల్ప దీక్ష శిబిరం జయప్రదం కోసం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లగా ప్రభుత్వం పోలీస్ బలగాలను మోహరించి అరెస్టులు చేయించిందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌లలోనే దీక్ష లు నిర్వహించామని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యా యులు తమ వాటాగా చెల్లించిన 10 శాతం, దానికి మాచింగ్‌గా ప్రభుత్వం ఇచ్చే వాటా మొత్తం సొమ్ము ఎక్కడికి పోతుందో, ఏమై పోతుందనే గందరగోళం ఈ సంవత్సర కాలంలో ప్రతి ఒక్క సిపిఎస్ ఉద్యోగిలో ఉందన్నారు. 33 శాతం సర్వీస్ పెన్షన్ ఇస్తామని గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను కొత్త పథకాన్ని ముందుకు తెచ్చారని, ఇది కూడా ఆమోదయోగ్యం కాదని, మరొక దోపిడి పథకమన్నారు. పిఎఫ్‌కు జమ కావాల్సిన 7 విడ తల డిఎలు ఇంతవరకు జమ కాలేదని తెలిపారు. 2022 జనవరి నుంచి రావాల్సిన 3 కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని, అవి ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. 9 నెలల నుంచి పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు, సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవసరాలు కోసం అప్పు తెచ్చిన చోట వడ్డీలు పెరిగి పోతున్నాయని, దాచుకున్న డబ్బులు ఇవ్వడానికి కూడా విపరీత కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, మరో బిఆర్‌టిఎస్ ఉద్యమంకు శ్రీకారం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్య ప్రకాష్, ఫక్రుద్దీన్, నాగస్వామి నాయక్, వెంకటేశ్వర రెడ్డి, గోపాల్, షమీమ్ భాను, నాగ లక్ష్మి, సంధ్యా రాణి, జాన్సన్, వెంకటయ్య, నభి రసూల్, రామకృష్ణ రెడ్డి, రాం నాయక్, మధు, శివ శంకర్, ఫిదా హుస్సేన్, ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం ముందు సంకల్ప దీక్ష నిర్వహిస్తున్న నాయకులు

తక్కువ నీటితోనే సేద్యం

- బిందు తుంపర సేద్యం రైతుకు నేస్తం
- ప్రజాశక్తితో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సిహెచ్ సత్యనారాయణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

"బిందు, తుంపర్ల సేద్యం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. తక్కువ నీటిని ఉపయోగించుకుని ఎక్కువ తడుపుకొని సాగు చేసుకునే అవకాశం బిందు తుంపర్ల ద్వారానే లభిస్తుంది. తక్కువ పెట్టుబడి తో పాటు ఎక్కువ ఆదాయాన్ని సాధించడానికి అవకాశం ఉంటుంది. బిందు తుంపర్ల సేద్యంను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీని అందజేస్తుంది. జిల్లాలో బిందు సేద్యం ఆదరణ బాగానే ఉంది. బిందు తుంపర్ల ద్వారా సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అలా వచ్చే వారికి ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగునీటి పథకం ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతోపాటు వారికి ప్రభుత్వం నుండి వచ్చే సహాయ సహకారాలు అందిస్తాం" అని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాలో మైక్రో ఇరిగేషన్ ఎలా ఉంది?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : జిల్లాలో మైక్రో ఇరిగేషన్‌కు మంచి ఆదరణ ఉంది. బిందు తుంపర్ల సేద్యాన్ని రైతులు ఆహ్వానిస్తున్నారు. అందుబాటులో ఉన్న తక్కువ నీటి వనరులను సమర్ధవంతంగా వియోగించుకొని అధిక విస్తీర్ణంను సాగులోకి తెచ్చి నాణ్యమైన అధిక దిగుబడులను పొందడమే లక్ష్యంగా ప్రభుత్వం 2003 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకంను ప్రారంభించింది.

బిందు తుంపర్ల సేద్యంలో రైతులకు ఇస్తున్న సబ్సిడీలు వివరించగలరు?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : ఈ పథకం కింద రైతులకు బిందు తుంపర సేద్యం పరికరములు రాయితీపై అందిస్తున్నాం. ఈ పథకం 2003 సంవత్సరం సెప్టెంబరు నెలలో ప్రారంభమైన నాటి నుండి 2019-2020 వరకు జిల్లాలో 53,676 మంది రైతులకు 64,413 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్లు ఈ పథకం ద్వారా అందించారు.

ఆర్థిక సంవత్సర ప్రణాళిక ఏంటి?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : ఈ సంవత్సరంలో బిందు సేద్యం పథకం అమలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రిప్ పరికరాలను ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో, ఐదు ఎకరంలో పైబడి పది ఎకరములు లోపు భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీతోను, స్పింకర్లు 5 ఎకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 55 శాతం రాయితీతో, 5 ఎకరాలు పైబడి 12 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు 45 శాతం రాయితీతోను ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాయితీని ప్రభుత్వం ప్రకటించింది.

జిల్లాలో ఈ ఏడాది ఎన్ని హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం లక్ష్యంగా పెట్టుకున్నారు?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 4వేల హెక్టర్లలో ప్రతిపాదిత లక్ష్యంగా నిర్ణయించాం. మండలాల వారిగా పంటల వారీగా నివేదికల తయారుచేసి ప్రభుత్వానికి పంపాము.



బిందు సేద్యం కోసం రైతులు ఎలా నమోదు చేసుకోవాలి, ఎక్కడ చేసుకోవాలి?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : ఆసక్తి కలిగిన రైతులు తమ వివరాలను సమీప రైతు భరోసా కేంద్రాలలో ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇప్పటి వరకు 9,128 మంది రైతులు, 10480.44 హెక్టార్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయింది. ప్రభుత్వ రాయితీ పోను మిగిలిన డబ్బును రైతులు చెల్లించిన తర్వాత వారికి డ్రిప్ పరికరాలు అందిస్తాం.

జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో ఈ పథకం నడుస్తుంది?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : ప్రధానంగా గడివేముల, ప్యాపిలి, డోను, బేతంచెర్ల, మహానంది, బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాలలో బిందు సేద్యానికి ప్రాధాన్యత ఉంది. రైతులు కూడా ముందుకు వస్తున్నారు. జిల్లాలో ఆత్మకూరు, పాములపాడు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, సిరివెళ్ల, పాణ్యం కొత్తపల్లి వంటి ప్రాంతాలలో తుంపర్ల సేద్యంను ఉపయోగిస్తారు.

బిందు, తుంపర్ల సేద్యంలో ఏఏ పంటలకు సబ్సిడీ ఇస్తారు?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : ముఖ్యంగా పండ్ల తోటలు, అరటి, బొప్పాయి, జామ, కూరగాయలు వంటి పంటలకు, ఆయిల్ సీడ్స్, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది.

బిందు, తుంపర్ల సేద్యంపై రైతుల్లో ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

అధికారి సిహెచ్ సత్యనారాయణ : గ్రామ సచివాలయంలో, రైతు భరోసా కేంద్రాల వద్ద, విహెచ్ఎఎ, విఎఎ, విఎస్ఎలు గ్రామాల వారిగా ఐదు మంది ఏరియా అధికారులు గ్రామ, మండల వారిగా రైతులకు ఈ పథకం గురించి వివరించడంతో పాటు వాటిని అందుబాటులో ఉంచుతారు. వైఎస్ఆర్ తోట బడి కార్యక్రమం, రైతు అవగాహన సదస్సులు, ప్రభుత్వ కార్యక్రమాలలో నమూనా స్టాల్సు ఏర్పాటు చేయడం, కరపత్రాలు ద్వారా, దినపత్రికల ద్వారా అవగాహన రైతుల్లో కల్పిస్తున్నాం.



గడప గడప కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి



ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ఈ నెల 6, 7వ తేదీలలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి నాయకులను, కార్యకర్తలను కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని మిక్కినేనిపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు కొండ సుంకేసుల బస్సును నడుపుతున్న ఆర్‌టిసి డ్రైవర్ గౌస్ (57) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివరాలు.. మిక్కినేనిపల్లె గ్రామంలో ఆర్‌టిసి బస్సు ఐదు గంటలకు బస్టాండ్‌లో నిలబడి ఉంది. ప్రజలు బస్సులో ఎక్కుతున్న సమయంలో డ్రైవర్ గౌస్ స్టీరింగ్ ముందు కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సులో ఎక్కిన ప్రయాణికులు వెళ్లి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. బస్సు రన్నింగ్ ఉన్న సమయంలో డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింటే ఎక్కువ ప్రమాదం జరిగి ఉండేదని మిక్కినేనిపల్లె గ్రామ ప్రజలు తెలిపారు.

సిఎస్ఐ చర్చి నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో సిఎస్ఐ చర్చి నిర్మాణానికి దక్షిణ ఇండియా సంఘం నంద్యాల అధ్యక్ష మండలం బిషప్ రైట్ రెవరెండ్ ఎగ్గొని పుష్ప లలిత ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ చెడు మార్గాలను వీడి భక్తి భావంతో సన్మార్గంలో మెలగాలన్నారు. జిల్లాలో సిఎస్ఐ చర్చి నిర్మాణాల కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఎస్ఐ పాస్టర్ ఇమ్మానుయేల్, సామ్యూల్, పీటర్, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న బిషప్

ఎమ్మెల్సీలుగా పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించండి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్.బాబు

ప్రజాశక్తి-డోన్

నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎస్.బాబు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతుల నాగరాజు, కత్తి నరసింహా రెడ్డిలు నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, నిరుద్యోగ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ బడుగు, బలహీన వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నారని, ఇటువంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు నరసింహుడు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు శివరాం, మండల, పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, నక్కీ శ్రీకాంత్, రైతు సంఘం మండల అధ్యక్షులు నాగ మద్దయ్య, యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు రామమూర్తి, సీనియర్ నాయకులు సుబ్బరాయుడు, ప్రైవేట్ పిఈటి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోహన్ గౌడ్, నాయకులు శంకర్ గౌడ్, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.ఏ.చిన్న రెహమాన్, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యు.శ్రీనివాసులు, ఐద్వా మండల కార్యదర్శి దేవి శ్రీలక్ష్మి, ఆర్టీసీ హైయర్ బస్సు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య గౌడు, నాగరాజు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, విజయ్, డివైఎఫ్ఐ అధ్యక్షుడు హబీబ్ బాషా, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి అక్బర్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.పుల్లయ్య, డి.దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ఎస్.బాబు

చిట్టడివిలా శిల్పా నగర్

- విద్యుత్, రోడ్లు, తాగునీరు కరువు.. - నివాసముంటున్నది 4 కుటుంబాలే..
- 134 మందికి ప్లాట్లు పంపిణీ - 15 ఏళ్ల నుండి ప్లాట్లు ఖాళీ - లబ్ధిదారుల్లో అత్యధికంగా అనర్హులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో 15 సంవత్సరాల క్రితం నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించి పంపిణీ చేసిన శిల్పా నగర్ నేడు చిట్టడవిని తలపిస్తోంది. శిల్పా నగర్‌లో కనీస వసతులు విద్యుత్, తాగునీరు, రోడ్లు లేకపోవడంతో అక్కడికి రావడానికి విముఖత చూపారు.

ఇల్లు లేని నిరు పేదలకు ఇంటి స్థలాన్ని ఇవ్వాలని సదుద్దేశంతో బండి ఆత్మకూరు మండలం సంత జూటూరు గ్రామంలో 2008 సంవత్సరంలో నంద్యాల-ఆత్మకూరు రహదారి పక్కన సర్వే నెంబర్ 51, 52లలో 4.54 ఎకరాల భూమిని సేకరించారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు నివాస స్థలాల కోసం కేటాయించారు. ఈ స్థలాల్లో 134 మంది పేద ప్రజలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారు. శిల్పా నగర్‌లో ప్రజల నివాసానికి యోగ్యంగా విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. ఆ స్థలాల్లో ఇంతవరకు నాలుగు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. వారు భూపని వెంకటరమణ, ఈడిగ రామస్వామి, తెలుగు పద్మావతి, సత్తార్ భాషాలు మాత్రమే ఇల్లు కట్టుకొని నివాసముంటున్నారు. అయితే 157 ప్లాట్లలో నలుగురు మాత్రమే నివాసం ఉండటం వల్ల మిగతా ప్లాట్లలో కంప చెట్లు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తోంది. చెట్ల పొదల నుంచి విష పురుగులు, పాములు ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని వారు వాపోతున్నారు. పాములు వర్షాకాలం, ఎండాకాలం, చలికాలం అనే తేడా లేకుండా విపరీతంగా తిరుగుతున్నాయని, రోజు క్షణక్షణం భయంతో కాపురం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు ప్రభుత్వ ధనం వెచ్చించి పేద ప్రజలకు సొంత ఇల్లు ఉండాలని ఆకాంక్షతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే ఇంతవరకు కాలనీలో ఎవరూ చేరకపోవడంతో అనర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజమైన అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఉంటే ఇంత దయనీయ పరిస్థితి ఉండేది కాదని, జగనన్న కాలనీ కూడా శిల్పా నగర్‌లో ఏర్పాటు చేసి ఉంటే చాలామంది పక్క గృహాలు నిర్మించుకునే వారిని గ్రామ ప్రజలు చెబుతున్నారు. రెండుకార్లు పంటలు పండే భూములను ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తే రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని పలు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ నిజమైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేసి శిల్పానగర్ అభివృద్ధి అయ్యేలా చర్యలు చేపట్టాలని సంతజుటూరు గ్రామస్తులు కోరుతున్నారు.


అడవిని తలపిస్తున్న శిల్పా నగర్ ప్లాట్లు

అడవిలా మారింది



మా కుటుంబానికి సొంత స్థలం లేకపోవడంతో అడవిని తలపిస్తున్న శిల్పా నగర్లో రేకుల షెడ్డు వేసుకొని జీవిస్తున్నాం. మా కుటుంబంలో ఇద్దరు పిల్లలు, భార్యాభర్త నలుగురం మాత్రమే ఉన్నాం. ఇంటి చుట్టూ ఎప్పుడు ఏ పాము వస్తుందోనని భయాందోళన చెందుతున్నాం. నేను చిన్న హోటల్ పెట్టుకొని జీవిస్తున్నాను. శిల్పా నగర్‌లో లబ్ధిదారులు చేరేలా అధికారులు, రాజకీయ నాయకులు చొరవ చూపాలి.

పాములతో సహవాసం చేస్తున్నట్లు ఉంది



కుటుంబ సభ్యులు పాములతో సహవాసం చేస్తున్నట్లు జీవిస్తున్నాం. 15 సంవత్సరాల క్రితం ఇచ్చిన ప్లాట్లలో ఇంతవరకు నాలుగు కుటుంబాలు మాత్రమే కాపురం చేస్తున్నాయి. రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు శిల్పా నగర్‌లో కుటుంబాలు చేరే విధంగా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ శిల్పా నగర్ అభివృద్ధి పైన చర్యలు చేపట్టాలి. విద్యుత్, తాగునీరు, రోడ్లు సౌకర్యం కల్పించాలి.

- శిల్పా నగర్ వాసి భూపని వెంకటరమణ.

ఎంఇఒను సస్పెండ్ చేయాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో శ్రీ వాణి, విజ్-డమ్ పాఠశాలలో మౌలిక వసతులు లేవని ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఎంఇఒను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐసా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, ఐసా జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుమార్‌లు మాట్లాడారు. గత వారం రోజులుగా విద్యార్థి సంఘాలుగా శ్రీవాణి, విజ్-డమ్ స్కూళ్లలో మౌలిక వసతులు లేవని, ఆటస్థలం, మరుగుదొడ్లు, మునిసిపల్ సర్టిఫికెట్ లేకున్నా నిర్వహిస్తున్నారని ఎంఇఒకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కనీసం పాఠశాలలను సందర్శించకుండా నిర్లక్ష్యంగా వారికే వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ఎంఇఒను సస్పెండ్ చేసి, శ్రీవాణి, విజ్-డమ్ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు హరి, వర్ధన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భూమా కుటుంబాన్ని విమర్శించే స్థాయి శిల్పాకు లేదు : టిఎన్‌టియుసి

ప్రజాశక్తి - చాగలమర్రి

భూమా కుటుంబాన్ని విమర్శించే స్థాయి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి లేదని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎవరైన వ్యక్తిగత ఆరోపణలు లేకుండా రాజకీయంగా మాట్లాడాలే తప్ప విమర్శించడం సరి కాదన్నారు. నంద్యాల అభివృద్ధికి వన్నె తెచ్చిన భూమా కుటుంబాన్ని విమర్శించే స్థాయి శిల్పాకు లేదన్నారు. రానున్న ఎన్నికలలో వైసిపికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కొలిమి షరీఫ్, మౌలాలి, అజీం, అబ్దుల్లా, జులేఖ షరీఫ్, రాముడు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

గ్రామాలలో చిన్న చిన్న విషయాలపై చోటు చేసుకున్న ఘర్షణల వల్ల నమోదు చేసిన కేసుల పట్ల ఇరు వర్గాలకు అవగాహన కల్పించి లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా అవగాహన కల్పించాలని గ్రామీణ మహిళా పోలీసులకు బేతంచర్ల సిఐ ప్రియతం రెడ్డి సూచించారు. ఈ నెల 11న జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌పై చిన్నచిన్న కేసులను రాజీ చేయడంలో గ్రామీణ మహిళా పోలీసులు అనుసరించాల్సిన విధానాన్ని సిఐ ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బేతంచర్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

స్కందాన్షీ కాలనీని అభివృద్ధి బాటలో నడిపిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని స్కందాన్షీ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్కందాన్షీ కోవెల కాలనీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పార్క్ అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కూడా ప్రారంభించారు కాబట్టి కాలనీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కర్రా గిరిజా రెడ్డి, పట్టణ సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచి సూర్యనారాయణ రెడ్డి, వైసిపి నాయకుడు కర్రా హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బివి నాగార్జున రెడ్డి, వెలగటూరు సర్పంచ్ ఎల్వి సుధాకర్ రెడ్డి, చిక్కేపల్లి ప్రసాద్ రెడ్డి, వైసీపీ లీగల్ అడ్వైజర్ లాయర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, స్కంధా కాలనీ సొసైటీ అధ్యక్షుడు ఎత్తపు రామ్ మోహన్ రెడ్డి, సెక్రెటరీ లెక్చరర్ డాక్టర్ సి రామలింగారెడ్డి, సొసైటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మైనార్టీల పట్ల వైసిపి వివక్ష : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో మైనార్టీ ప్రజలకు గతంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను వైయస్సార్ ప్రభుత్వం తొలగించడంతోపాటు వారి పట్ల వివక్ష చూపుతున్నదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని 9, 10వ వార్డులలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మైనార్టీ కాలనీలో ఆయన పర్యటించి వైసిపి ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కలిములల్లా, మైనార్టీ నాయకులు రేడియం నూర్. అబ్దుల్లాపురం భాష. శ్రీశైలం దేవస్థానం మాజీ ఛైర్మన్ వంగాల శివరామరెడ్డి. ప్రముఖ న్యాయవాది గోవింద్ రెడ్డి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకట్రావు, మైనార్టీ నాయకుడు షఫీవుల్లా, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తిరుపమయ్య, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పుల్లారెడ్డి, నబి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి గజమాలతో స్వాగతం పడుతున్న మైనార్టీ సోదరులు

విస్తారంగా మొక్కజొన్న సాగు

- బనగానపల్లె మండలంలో రబీలో 4 వేల ఎకరాల్లో సాగు

ప్రజాశక్తి - బనగానపల్లె



బనగానపల్లె మండలంలో రబీలో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. మండలంలోని యాగంటి పల్లె, పాతపాడు, మీరాపురం, జోలాపురం, క్రిష్ణగిరి, చెర్లో కొత్తూరు, చిన్న రాజుపాలెం, చిన్న రాజుపాలెం తాండ, పెద్దరాజుపాలెం కాలే నాయక్ తండా, బద్రేనాయక్ తండా, పసుపల, పసుపల తండా, యనకండ్ల తదిత గ్రామాలలో మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. మండలంలో 4 వేల ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మొక్కజొన్నకు ధర ఉండడం, దిగుబడి ఆశించినంత వస్తుండడంతో రైతులు పంట సాగు పట్ల మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న పంటకు పెట్టుబడి తక్కువ. దిగుబడి అధికంగా వస్తున్నడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఎకరానికి 30 నుండి 35 క్వింటాల దిగుబడి వస్తుండడం, క్వింటా 2000 రూపాయలు ధర పలుకుతుండడం రైతులకు లాభదాయకంగా ఉంది. వరి, మిరప, పత్తి పంటలను వేసి నష్టపోయిన రైతులు మొక్కజొన్న సాగుపై మక్కువ చూపుతున్నారు. అయితే మొక్కజొన్న పంట వేసిన రైతులకు అడవి పందుల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు తగు చర్యలు తీసుకొని అడవి పందుల బెడదను అరికట్టాలని రైతుల కోరుతున్నారు.

అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు

- సుబ్బారెడ్డి వ్యవసాయ అధికారి



ఈ సంవత్సరం రబీలో రైతులు మొక్కజొన్న పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దాదాపు 4 వేల ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్నకు తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి వస్తుండడంతో మొక్కజొన్నలు సాగు చేస్తున్నారు. ప్రతి రైతు వేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

పోతుల నాగరాజును గెలిపించండి : సిఐటియు

ప్రజాశక్తి - పాణ్యం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుని గెలిపించాలని కోరుతూ సిఐటియు పాణ్యం మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎన్నికల ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, ఆటో కార్మికులు వెంకట్ రాజు, హమాలీ కార్మికులు చంద్ర, ఓబులేసు, మల్లికార్జున, మహేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రజా సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ వానపల్లి గ్రామంలో ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిఐటియు నాయకులు రత్నమయ్య రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, శ్రావణ్, రాజు, సుధాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

శ్రీశైల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - శ్రీశైలం

పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీశైల దేవస్థానం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. సాయంకాలం స్వామి అమ్మవార్ల మహా మంగళహారతులు, అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన : పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పరోక్ష సేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఇందులో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు, బ్రిటన్, అమెరికా నుండి కూడా పలువురు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు ఊయల, పల్లకీ సేవలు : శ్రీశైల క్షేత్రంలోని స్వామి అమ్మవార్లకు లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకొని దేవస్థానం ప్రత్యేక ఊయల సేవ కార్యక్రమాన్ని నిర్వహించింది.

సిద్ధవటంలో స్వామి అమ్మ వాళ్లకు కళ్యాణ్ ఉత్సవం : శ్రీశైల క్షేత్రానికి అనుబంధ దేవాలయమైన దక్షిణ ద్వారమైన కడప జిల్లాలోని సిద్ధవటక్షేత్రంలో జ్యోతి సిద్ధేశ్వర స్వామికి రుద్రాభిషేకం,కామాక్షి అమ్మవారికి కుంకుమార్చన, కళ్యాణోత్సవాన్ని శ్రీశైలం దేవస్థానం నిర్వహించింది.

జంబులా పరమేశ్వరి దేవికి విశేష పూజలు

రుద్రవరం : రుద్రవరం సమీపంలోనిజంబులా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని ఆలమూరు గ్రామంలోని మఠం వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పున:నిర్మాణం సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. **బేతంచర్ల :** బేతంచర్లలోని బనగానపల్లి రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ అమ్మవారికి పౌర్ణమి పురస్కరించుకొని మండల, పట్టణ, గ్రామాల ప్రజలు ఆదివారం తెల్లవారుజాము నుండి అమ్మవారికి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు రామకృష్ణ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

టిడిపి పాలనలోనే అభివృద్ధి సాధ్యం

- వైసిపి నాయకులు అభివృద్ధిలో పోటీ పడాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని, వైసిపి నాయకులు అభివృద్ధిలో పోటీ పడాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్‌టిఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి టిడిపి జెండా ఆవిష్కరించారు. అనంతరం నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. యూనిట్ ఇంచార్జ్‌లకు, క్లస్టర్ ఇన్చార్జిలకు, సెక్షన్ ఇన్చార్జిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. బనగానపల్లె పట్టణంలో ఇండ్ల పట్టాలు ఇవ్వకుండా తాను అడ్డుకుంటున్నానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించడం దారుణమన్నారు. గతంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 3000 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. మరోసారి ఇంటి పట్టాలను ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి ఆర్‌టిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ మస్తాన్ వలి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పరమేశ్వర రెడ్డి, టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథరెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య , బీసీ సెల్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, తెలుగు యువత నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి ,బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి ,మూల రామేశ్వర రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు గడ్డం నాగేశ్వర రెడ్డి, కనకాద్రిపల్లె లక్ష్మి రెడ్డి, టిప్ టాప్ కలాం, కృష్ణ నాయక్, లాయర్ నాగేందర్ రెడ్డి, ఖాదర్ భాష,పుల్లారెడ్డి, రాయలసీమ సలాం ,పవన్ కుమార్ రెడ్డి, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ,టిడిపి నాయకులు



గజమాల వేస్తున్న నాయకులు

మాండ్ర వారి వివాహ వేడుకలకు భారీగా వెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - పాములపాడు

టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి కూతురు వివాహ రిసెప్షన్ వేడుకలకు పాములపాడు మండలం నుండి టిడిపి నాయకులు భారీగా అధిక సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. పార్లమెంట్ ఇన్చార్జి శివానందరెడ్డి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకట్ రెడ్డిలకు గజమాలవేసి సత్కరించారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు హరినాధ రెడ్డి, మండల నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, యువ నాయకులు మధు కృష్ణ, వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కైప గ్రామంలో పట్టపగలు చోరీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన షేక్ బాషా ఇంటిలో పట్టపగలు చోరీ చేసి ఆరున్నర తులాల బంగారం, రూ. 10 వేలు నగదును దొంగిలించారు. పోలీసులు, గ్రామ ప్రజల వివరాల మేరకు.. ఆదివారం షేక్ బాషా కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం బయటి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయం చూసుకుని ఉదయం 9:30 గంటలకు ఇంటి వెనక గూడు రాయిని పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి ట్రంకుపెట్టే బీగాన్ని పగలగొట్టి ఆరున్నర తులాల బంగారం, రూ. 10 వేలు నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

ఆశాజనకంగా ఆముదం పంట సాగు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా గ్రామాలలో సాగు చేసిన ఆముదం పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని పెద్ద కంబలూరు, శ్రీరంగాపురం, డి కొట్టాల, ఎల్లా వత్తుల, కోటకొండ, అప్పనపల్లి, తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో రైతులు ఆముదం పంటను సాగు చేశారు. ఈ పంట దిగుబడి ఎకరానికి 8 నుంచి 10 క్వింటాల వరకు వస్తుందని రైతులు తెలిపారు. ఆముదం విత్తనాలు క్వింటా ధర రూ.7 వేల దాకా పలుకుతుందని రైతుల తెలిపారు. ఆముదం పంటను అడవి పందులు, పశువులు, మేకలు గొర్రెలు, పంటను తినవు. ఎలాంటి నష్టం చేయవు. దీంతో సాగు చేయడానికి ఇబ్బంది లేదని రైతులు అంటున్నారు. పంట కూడా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని, అందుకే ఆముదం పంట సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. తాయో సీడ్ ఆముదం పంట మంచి దిగుబడులు వస్తున్నాయని, పండిన పంటకు కూడా మార్కెట్ బాగా ఉందని, ఆముదం పంట సాగు చేయడానికి సులభంగా ఉందని, అందుకే సాగు చేశామని రైతులు తెలిపారు.



ఆశాజనకంగా ఉన్న ఆముదం పంట

అమృత డయాగ్నొస్టిక్స్ స్కాన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ప్రముఖ రేడియాలజీ నిపుణురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత డయాగ్నొస్టిక్ స్కాన్ సెంటర్, ప్రత్యేక ఫీటల్ స్కాన్ కేంద్రాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కాన్ నిపుణురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భస్థ శిశువుకు ఐదు నెలలు నిండిన తర్వాత ఈ ప్రత్యేక ఫీటల్ స్కానింగ్ ద్వారా ఏవైనా శారీరక లోపాలు ఉన్నట్లయితే గుర్తించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా అవసరమైన చికిత్స అందించి ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిచ్చే అవకాశం స్త్రీలకు ఏర్పడుతుందని చెప్పారు. స్కాన్ యంత్రంను ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎంఏ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ పనిల్, రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వసుధ ,మిషన్ పింక్ హెల్త్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నర్మదా, కార్యదర్శి డాక్టర్ మాధవి, ప్రముఖ రేడియాలజినిపుణురాలు డాక్టర్ లలిత చిన్నపిల్లల డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

అందరి సహకారంతో అహోబిల క్షేత్రం అభివృద్ధి

- సుప్రీంకోర్టు తీర్పుతో అహోబిలం మఠానికి బాధ్యత పెరిగింది : మాజీ ఎంపీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిల క్షేత్రం అభివృద్ధిలో మఠం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రతాప్ థియేటర్ వద్ద ఉత్సవ పల్లకికి గంగుల ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిని మోసారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎన్నో మఠాలు ఉన్నప్పటికీ 600 సంవత్సరాల కలిగిన అహోబిల మఠంలోనే సాంప్రదాయ బద్ధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. క్షేత్ర అభివృద్ధి విషయంలో మా తండ్రి గంగుల తిమ్మారెడ్డి ఎంతో శ్రమించారని, ఆయన నుంచి తాను బాధ్యత తీసుకొని అభివృద్ధి పరంగా మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమన్నారు. అభివృద్ధి విషయంలో మఠం వారికి సంపూర్ణ అధికారాలు ఉంటాయని సుప్రీంకోర్టు తీర్పుతో మఠం వారికి మరింత బాధ్యత పెరిగిందన్నారు. కట్టుబాట్లతో కట్టడి చేయడం వలన అంటరానితనం పెరిగే అవకాశం ఉందని వారికి సూచించారు. మఠం జియ్యార్ విశేష జ్ఞానం కలవారని గంగుల కితాబు ఇచ్చారు. క్షేత్రంలో తమ తరఫున ప్రతినిధులుగా నియమించే వారి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు తరిమికొట్టే వారికే పగ్గాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. జియ్యర్ కు తెలియకుండా చాలా జరుగుతున్నాయని అన్నారు.



ఉత్సవ పల్లకికి పూజలు నిర్వహించి మోస్తున్న గంగుల

బ్రహ్మోత్సవాల నిర్వహణ కలెక్టర్ తీసుకోవాలి : అహోబిల బ్రహ్మోత్సవాలు నిర్వహణ బాధ్యత జిల్లా కలెక్టర్ తీసుకోవాలని మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి అన్నారు. ఈ నెల 28 నుండి మార్చి నెల 8 వరకు జరిగే బ్రహ్మోత్సవాల బాధ్యత జిల్లా కలెక్టర్ తీసుకోవడం వల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉంటాయన్నారు. తాగునీరు, స్నానాలకు ఇబ్బందులు లేకుండా ఇరిగేషన్ అధికారులు చూడాలన్నారు. శ్రీశైల క్షేత్రానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో అహోబిల క్షేత్రానికి కూడా అదే ప్రాధాన్యత ఇచ్చి కలెక్టర్ బాధ్యతలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. హరినగరం నుండి అహోబిలానికి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి మరమ్మతు పనులు బాగా జరుగుతున్నాయని త్వరలోనే పూర్తవుతాయన్నారు. అలాగే బాచేపల్లి నుండి అహోబిలం వెళ్లే దారి దెబ్బతిందని, పంచాయతీరాజ్ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎగువ అహోబిలం సమీపంలో ఉన్న మరుగుదొడ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను మీడియా సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని తారకరామనగర్‌లో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ ఇన్నర్ వీల్ క్లబ్ వారికి కేటాయించిన మున్సిపల్ పార్కులోని 11 మంది గర్భిణులకు పూర్ణ, రవిశంకర్ రెడ్డి, వసంత, గంగిరెడ్డి దంపతుల ఆర్థిక సహకారంతో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఏ శాంతి ఆదివారం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఏ శాంతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం పూర్ణ, రవిశంకర్ రెడ్డి, వసంత, బైరెడ్డి గంగిరెడ్డి దంపతులను ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రాజాసుజాత, శారద, సుమిత్ర, అనంత లక్ష్మి, సరోజమ్మ, షాలిని, అనురాధ, సుధ, శారద, పద్మ, హెల్త్ సూపర్వైజర్ సరస్వతి, అంగన్వాడీ సూపర్వైజర్ పరమేశ్వరమ్మ, టీచర్లు సులోచన, జైనాబి తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-డోన్

కర్నూలు సి క్యాంపు ప్రభుత్వ డ్రైవర్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 6న జరగబోయే భారత కార్మిక సంఘాల సమైక్య మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రంగనాయకులు కోరారు. ఆదివారం డోన్ మండలం ధర్మవరం గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మికులకు, రైతులకు, విద్య, వైద్యంకు కోతలు విధిస్తూ అంకెల గారడి చేస్తుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఆర్థిక బడ్జెట్‌లో చిలుక పలుకులు పలుకుతున్నారని, వాటి వల్ల దేశ ప్రజలకి మంచి జరగదన్నారు. కర్నూలులో జరిగే మహాసభకు కార్మికులు, ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చంద్రుడు, గోపాల్, రవి, యువరాజ్, సురేష్, రమేష్, రామాంజి, రాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రంగనాయకులు

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా

మహానంది : నల్లమల్లలోని నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి మోత్కమాన్ రైల్వే వంతెన సమీపంలోని మలుపు వద్ద లారీ బోల్తా పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. నంద్యాల నుండి మిర్చి లోడుతో దర్శికి వెళ్తున్న మినీ లారీ వాహనాన్ని గిద్దలూరు నుండి వరి ధాన్యం లోడుతో నంద్యాల వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. మహానంది ఏఎస్ఐ కృష్ణుడు, హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణ, హోంగార్డు శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని భారీ ప్రొక్లైన్‌తో లారీని పక్కకి జరిపి రాకపోకలు పునరుద్ధరించారు.

బోయ వాల్మీకులకు న్యాయం చేయాలి

శ్రీశైలం : రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు పార్లమెంటు సమావేశాలలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలిపే బిల్లును ప్రవేశపెట్టి బోయ వాల్మీకి కులస్తులకు న్యాయం చేయాలని ఎపి బోయ వాల్మీకి సంఘం స్టేట్ జాయింట్ సెక్రెటరీ నల్లబోతుల మల్లికార్జున ప్రభుత్వాలను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్టి జాబితాలో బోయ వాల్మీకులను కలిపేందుకు బిల్లును పాస్ చేయించాలని, లేనిపక్షంలో బోయ వాల్మీకి జాతి ప్రజలందరం కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని పేర్కొన్నారు.

కళ్యాణ ఆహ్వాన పత్రికలు విడుదల

చాగలమర్రి : శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎంపీపీ వీరభద్రుడు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వేద పండితులు కైప నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

చాగలమర్రి : టిటిడి ఆర్థిక సౌజన్యంతో మండలంలోని శెట్టివీడు గ్రామం ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవాణి ట్రస్టు ద్వారా సమరత సేవా ఫౌండేషన్ పర్యవేక్షణ ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. అభినవ శంకరానంద ఆధ్వర్యంలో ధ్వజ స్థంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ సల్లా నాగరాజు, సర్పంచ్ లక్ష్మిదేవి, జిల్లా బాలవికాస్ కేంద్ర కన్వీనర్ తిమ్మారెడ్డి, చంద్రశేఖరయ్య, నంద్యాల డివిజన్ ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, గుత్తి నర్సింహులు, రామ నారాయణ రెడ్డి, భవానమ్మ, మల్లికార్జున, పెద్దనరసింహారెడ్డి, పుల్లయ్య, నరసింహారెడ్డి, ఓబులేసు, సుబ్బయ్య, రమణయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవాలు

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం జ్యోతుల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ హాజరు కాగా ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, పూలమాల, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ సుకూర్, నందికొట్కూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మొల్ల రబ్బాని, కౌన్సిలర్లు దేశెట్టి సుమలత, మొల్ల. జాకీర్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ దేశెట్టి శ్రీనివాసులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

డోన్ : డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకట సుబ్బారెడ్డి, రామనరసప్ప, మైమున్నిసా, ప్రసాద్‌లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 384 మంది విద్యార్థులకు గాను 362 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 437 మంది విద్యార్థులకు 422 మంది విద్యార్థులు హాజరయ్యారని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆదాం బాషా తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా మౌలాలి, వెంకట రమణ, రాంప్రసాద్, ప్రసాద్‌లు వ్యవహరించారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెళ్లి కానుకలు పంపిణీ

బనగానపల్లె : పట్టణానికి చెందిన తమ్మత్యల భాస్కర్ కుమార్తె, మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చల్లా. మద్దిలేటి కుమార్తెల వివాహాలకు పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పెళ్లి కానుకలను ఆదివారం పంపిణీ చేశారు.



పెళ్లి కానుకలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
O.S 474/2022

S.Ameer Basha
S/o Shaik Ibrahim Basha
R/o Banaganipalli town and mandal,
now R/o H.No.1-8, Gooty Road,
Dhone town and mandal, Kurnool (Dist).
now Nandyal (Dist). ...Plaintiff
V/s
S.Haseena W/o Shaik Basheer,
Muslim, R/o Kanakadripalli (Village),
Kolimigundla (M), Kurnool (Dist).
now Nandyal (Dist). ...Defendant

సమను ప్రకటన

పై దావా నందు కనపరిచిన Plaintiff కు Defendant అయిన మీరుం 30-03-2015వ తారీఖున Mortgage deed No 774/2015 వ్రాయించి రూ. 2,00,000/- అప్పుగా తీసుకున్నారు. సదరు Mortgage deed Amount ను రాబట్టుకొనుటకు Plaintiff మీ మీద పైకోర్టు నందు దావా వేసి వున్నారు. పై దావా 01/03/2023వ తారీఖున వాయిదా కలదు. కావున ఉదయం 10.30 గంటలకు స్వతహాగా గాని అడ్వకేట్ ద్వారా కాని హాజరు కావలెయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని తెలియజేయడమైనది.

By Court Order
G. Madhusudhana Rao, B.A., B.L.,
Advocte for Plaintiff,
Dhone , Nandyal Dist.
Cell : 9441733503

IN THE COURT OF SENIOR CIVIL JUDGE DHONE
I.P No. 79/2022

Shaik Mahaboob Basha
S/o Abdul Rajak,
R/o Dhone Town and Mandal, Kurnool (Dist).
now Nandyal (Dist). ...Petitioner
V/s
K.Sarojamma @ N.K.Lakshmidevi
& 5 Ohters. ...Respondant's
R3 : N.K.Sankar Baghavan S/o Late Nagappa,
R/o H.No. 8-6, Kothapeta, Kambalapadu Road,
Dhone Town and Mandal, Kurnool Dist,
Now Nandyla Dist.

Notice ప్రకటన

పై IP నందు కనపరిచిన Petitioner యొక్క Amount ను ఇవ్వకుండా 07/06/2022వ తారీఖున Yerakali Sivaramanjaneyulu గారికి Sale deed 1254/2022 ద్వారా Property ని అమ్మియున్నారు.

సదరు Sale deed ని Cancel చేస్తూ మిమ్మల్ని insolvent గా Declare చేయమని Criditor IP వేసి యున్నారు. సదరు Criditor IP 17/02/2023వ తారీఖున పై కోర్టు నందు వాయిదా కలదు కావున పై తారీఖున ఉదయం 10.30 గంటలకు స్వతహాగా కాని అడ్వకేటు ద్వారా కాని హాజరు కావలెయును లెనియెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని తెల్పడమైనది.

By Court Order
G. Madhusudhana Rao, B.A., B.L.,
Advocte for Plaintiff,
Dhone, Nandyal Dist.